సాక్షి మహబూబాబాద్

గురువారం । 30 । మార్చి । 2023



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జాక్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. - 10లో▸



వసంతోత్సవానికి వేళాయె

నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, స్ప్రింగ్ స్ప్రీ–23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
38.3^0 /24.3^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

పౌష్టికాహారం తీసుకోవాలి



గూడూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని డీడబ్ల్యూఓ వరలక్ష్మి అన్నారు. మండలంలోని పాటిమీదితండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నీలోఫర్ అజ్మీ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. డీడబ్ల్యూఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా చిరుధాన్యాల ఆహారం ఎంతో ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, టీచర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



కేసముద్రం: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి 108లో ప్రసవించిన ఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. మండలంలోని అర్పనపల్లి గ్రామానికి చెందిన మంజుల సువార్త అనే గర్భిణి పురిటినొప్పులతో బాధపడుతుండగా ఆమెను 108వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా ఉప్పరపల్లి గ్రామ సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ వీరన్న, పైలట్ సైదులు నార్మల్ డెలివరీ చేశారు. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలించారు.

టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో ఉపయోగం



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడానికి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు బాలికల పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి కృత్యమేళా కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు వినూత్న రీతిలో పాఠాలు బోధించాలన్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ విధానంతో విద్యార్థులు పాఠాలను లోతుగా అర్థం చేసుకుంటారన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కృత్యమేళాలో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రామారావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, నాణ్యత విద్య కోఆర్డినేటర్ బుచ్చయ్య, రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ్, హల్యా, మహేష్, సారంగం, రమేష్, శాంసన్ సుధాకర్, నాగముని, వీరన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి మాతకు లిల్లీ పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం లిల్లీ పూలతో మాతకు పుష్పార్చన నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు, అర్చకులు అమ్మవారికి నిత్యాహ్నికం జరిపారు. లిల్లీ పూలకు సంప్రోక్షణ చేసి లక్ష పుష్పార్చన నిర్వహించారు.

రక్తహీనతకు చెక్!

జిల్లాలో 28శాతం మంది గర్భిణులకు రక్తహీనత

- నివారణకు న్యూట్రీ కిట్‌ల పంపిణీ
- వచ్చే నెలలో ప్రభుత్వం అమలు
- సర్వం సిద్ధం చేస్తున్న వైద్యారోగ్యశాఖ





సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో చాలామంది గర్భిణులు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. కాగా పుట్టబోయే బిడ్డపై దీని ప్రభావం ఉంటుంది. బిడ్డపుట్టిన తర్వాత అనేక అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని రక్తహీనత నివారణకు పౌష్టికాహారంతో పాటు ప్రత్యేక పోషకాలు ఉన్న న్యూట్రీ కిట్ అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏప్రిల్ నుంచి జిల్లాలోని గర్భిణులకు పోషకాల కిట్ అందించనున్నారు. ఇందుకోసం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

జిల్లాలో 28శాతం..

జిల్లాలో 28శాతం మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారు. జిల్లాలో ఏజెన్సీ, గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నాయి. అక్కడి ప్రజలకు ఆహారపు అలవాట్లపై అంతగా అవగాహన ఉండదు. గర్భం దాల్చిన తర్వాత పౌష్టికాహారం, జాగ్రత్తలు తీసుకోవడం లేదు. దీంతో చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారు. కాగా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 988మంది గర్భిణులు ఉన్నారు. ఇందులో 28శాతం అంటే 278మంది రక్తహీనతతో బాధపడుతున్న వారు ఉన్నారు. దీంతో తల్లీబిడ్డలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. రాష్ట్రీయ బాలారోగ్య రక్షణ నిర్వహించిన పరీక్షల్లో జిల్లాలో 61మంది పుట్టుకతో అవయవ లోపం, 1,007మంది రక్తహీనత, 1,009మంది ఇతర వ్యాధులు, 1,245మంది పెరుగుదల లోపం, 423మంది కౌమార ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ఉన్నట్లు నిర్ధారించారు. కాగా ఇందులో సగానికిపైగా తల్లీగర్భంలోనే అనారోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

రెండుసార్లు కిట్‌ల పంపిణీ..

అంగన్వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, కూరగాయలు, పప్పు, ఆకుకూరలతో భోజనం పెడుతున్నారు. అయినా కొందరిలో రక్తహీనత తగ్గడం లేదు. దీంతో ఇప్పుడు అరకిలో నెయ్యి, కిలో ఖర్జూర పండ్లు,ఐరన్ సిరప్,ప్రొటీన్స్, విటమిన్లు ఉన్న పౌడర్(హార్లిక్స్‌లాంటిది), నట్టల నివారణ మాత్రలతో పాటు మోతాదు ప్రకారం తాగే విధంగా కప్పును ప్రత్యేకంగా తయారు చేసిన బుట్టలో పెట్టి సరఫరా చేస్తున్నారు. రూ.2వేల విలువచేసే ఈ కిట్‌లోని పదార్థాలు ఎలా తీసుకోవాలో చెప్పేందుకు ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. గర్భం దాల్చిన ఐదు నెలల తర్వాత ఒకసారి, ఎనిమిదో నెలలో మరోసారి కిట్ అందజేస్తారు.

ఇతర జిల్లాల్లో ఫలితాలు..

గత ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు ప్రారంభించిన న్యూట్రీ కిట్ పథకం మంచి ఫలితాలు ఇచ్చింది. కిట్ వల్ల ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రికొత్తగూడెం, కామారెడ్డి, వికారాబాద్, గద్వాల్, నాగర్‌కర్నూల్, ములుగు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులు, ప్రసవం తర్వాత పిల్లల ఆరోగ్యం మెరుగుపడినట్లు నిర్ధారించారు. వచ్చే నెలలో జిల్లాలో కూడా అమలు చేసేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు అంగీకరించారు.

గర్భిణులకు సీఎం ఇచ్చే కానుక..



ఆరోగ్య తెలంగాణ కావాలంటే తల్లి కడుపులో బిడ్డ పడినప్పటి నుంచి, బిడ్డ పెరిగే వరకు మెరుగైన వైద్యం, పౌష్టికాహారం తీసుకోవాలి. దీనిని దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందిస్తున్నాం. ఇప్పుడు రక్తహీనత సమస్యను అధిగమించేందుకు న్యూట్రీ కిట్ అందిస్తున్నాం. రాష్ట్రంలోని తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అందించే కానుక ఈ న్యూట్రీ కిట్.

– సత్యవతి రాథోడ్, రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి

నేడు శ్రీరామనవమి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఉత్సవ కమిటీ బాధ్యులు



సీతారామచంద్రస్వామి వారి ఉత్సవమూర్తులు

- జిల్లావ్యాప్తంగా రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు ఎదుట సీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, సీతారామ కల్యాణోత్సవ కమిటీ చైర్మన్ అనిల్‌గుప్త తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. కల్యాణోత్సవంలో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి అనుగ్రహం పొందాలన్నారు. ఉదయం 10గంటలకు నెహ్రూసెంటర్‌లో స్వామి ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుందని, మధ్యాహ్నం 12:17 గంటలకు సీతారాములు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, కల్యాణోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, కోశాధికారి నాయిని రంజిత్, ప్రోగ్రాం కన్వీనర్ గురునాథరావు తదితరులు ఉన్నారు.

ఆయా ఆలయాల్లో..

జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామిదేవాలయం, రామచంద్రాపురం కాలనీలోని రామమందిరం, పట్టణ శివారులోని సాలార్‌తండా, అనంతాద్రి దేవాలయం, శనిగపురం, రెడ్యాల గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆయా ఆలయాల ఉత్సవ కమిటీల బాధ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పురస్కారానికి చాప్లాతండా..

డోర్నకల్: మండలంలోని చాప్లాతండా గ్రామపంచాయతీ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైంది. పంచాయతీ అవార్డుల కోసం తొమ్మిది అంశాల్లో పోటీ జరగగా చాప్లాతండా నీటి సమృద్ధి విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 31న హైదరాబాద్‌లో చాప్లాతండా సర్పంచ్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకోనున్నారు. కాగా రాష్ట్రస్థాయిలో మెరవడంతో జాతీయస్థాయిలో ఇచ్చే అవార్డుల పోటీలో నిలిచింది.



గ్రామంలోని క్రీడాప్రాంగణం

మిరపనూనె తయారీ పరిశ్రమ వద్దు

డోర్నకల్: తమ గ్రామంలో మిరపనూనె తయారీ పరిశ్రమ ఏర్పాటును ఒప్పుకోమని మండలంలోని తొడేళ్లగూడెం గ్రామస్తులు తేల్చి చెప్పారు. బుధవారం తొడేళ్లగూడెం జీపీ కార్యాలయంలో మానుకోట ఆర్డీఓ కొమురయ్య సమక్షంలో మిరపనూనె తయారీ పరిశ్రమ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 131, 32, 33లోని 13ఎకరాల విస్తీర్ణంలో ఎస్‌కే ఆగ్రో ఎక్స్‌పోర్టు ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మిరపనూనె తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. కాగా పరిశ్రమ ఏర్పాటును గ్రామస్తులు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు జీపీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్డీఓ కొమురయ్య, ఇండస్ట్రీస్ జీఎం సత్యనారాయణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఉమాగౌరి, తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ మున్వర్‌బేగ్‌తో పాటు కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమ ఏర్పాటుతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉంటాయని, మిరప పంటను స్థానికంగా విక్రయించుకోవచ్చని అధికారులు పాలకవర్గానికి, గ్రామస్తులకు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటుతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని,పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని వార్డు సభ్యులు తీర్మానం చేశారు. పరిశ్రమ ఏర్పాటును గ్రామస్తులు సైతం వ్యతిరేకించారు. అయితే మరోమారు సమావేశం నిర్వహిస్తామని ఆర్డీఓ కొమురయ్య తెలిపారు. కాగా సమావేశం అనంతరం అధికారులు వాహనాల్లో వెళ్తున్న సమయంలో గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేయగా సీఐ వెంకటరత్నం, ఎస్సై రవికుమార్ వారిని తొలగించారు. గ్రామస్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కొమురయ్య

సీఎం నాయకత్వంలో గ్రామాల అభివృద్ధి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లి, సోమారం గ్రామాల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంలోని ఒక్కో గ్రామంలో రూ.కోటి మేర నిధులు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అలాగే 3వేల మంది మహిళలకు రూ.5.75కోట్లతో కుట్టు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మంత్రి దయాకర్‌రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్న అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషన్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, సర్పంచ్‌లు రవీంద్రాచారి, రవీందర్‌రెడ్డి, సంపత్, రమేష్, సరస్వతి, ఎంపీటీసీలు గణేష్, మాధవి, శోభ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సోమారంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

ఆలయాల అభివృద్ధికి కృషి..

ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి మండలంలోని మాటేడు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో బండ్లు తిరిగే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం స్థానికులతో కలిసి పూజా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఎంపీటీసీ కవిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత తదితరులు పాల్గొన్నారు.

కురవి వీరన్న భూమి సర్వే పూర్తి

- ఆక్రమణకు గురైన ఆరు గుంటలు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ భూముల సర్వే బుధవారం పూర్తయింది. ఈమేరకు ఆక్రమణకు గురైన ఆరుగుంటల భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని దేవాలయాల భూముల ఆక్రమణపై 'సాక్షి'లో 'దేవుడి భూములు గోవిందా,' 'శఠగోపం' శీర్షికన ఇటీవల ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. కలెక్టర్ శశాంక, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ చొరవతో కురవి వీరభద్రస్వామి ఆలయ భూములను సర్వే చేశారు. పెద్ద చెరువు కింద 78,79,88,169 సర్వే నంబర్లలో 3.39ఎకరాల భూములను దేవాదాయ ధర్మాదాయ శాఖ సర్వేయర్ అనిల్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ నరసింహమూర్తి, డీఐఓ దత్తు, సర్వేయర్ తిరుమల్‌రావు సర్వే నిర్వహించారు. సర్వే పనులను మహబూబాబాద్ ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ ఇమ్మానియేల్ పర్యవేక్షించారు. రెండురోజుల పాటు నిర్వహించిన సర్వేలో ఆరుగుంటల భూమి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. ఆ భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని మిగిలిన ఆలయాల భూముల సర్వే చేపట్టి లెక్క తేల్చడానికి సిద్ధంగా ఉన్నట్లు సర్వేయర్లు తెలిపారు.



కురవి పెద్ద చెరువు కింద భూములను సర్వే చేస్తున్న అధికారులు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్

మహబూబాబాద్: వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని మున్సిపాటీల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అదనపు కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం గృహాలకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. ముందు నివేదిక ఇవ్వాలని, అందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలన్నారు. వాటర్ ట్యాంకర్లను శుభ్రం చేయించి రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. పదివేల లీటర్ల నీళ్లకు 50గ్రాముల బ్లీచింగ్ పౌడర్ కలిపి క్లోరినేషన్ చేసుకోవాలని, దీనిని అధికారులు పర్యవేక్షించాలన్నారు. లీకేజీలు లేకుండా చూసుకోవాలని, నీటి చౌర్యాన్ని అరికట్టాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో తాగునీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో మున్సిపల్ డీఈ సీహెచ్‌ఉపేందర్, ఏఈలు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- వీసీలో మంత్రి సబితాఇంద్రారెడ్డి



వీసీలో పాల్గొన్న ఎస్పీ, అదనపు కలెక్టర్, అధికారులు

మహబూబాబాద్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ సెక్రటరీ వాకాటి కరుణ, విద్యాశాఖ సంచాలకులు దేవసేన, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏప్రిల్ 3నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ విద్యాసంవత్సరం 11పేపర్లకు బదులు 6పేపర్లు ఉంటాయనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పరీక్షలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా కంట్రోలు రూం ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. వీసీలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఈఓ రామారావు, డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ పాల్గొన్నారు.

31న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మెట్‌ల్యాబ్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్' అనే అంశం పై ఈ నెల 31న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు విభాగాధిపతి సీజే శ్రీలత, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు డాక్టర్ జి.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కేయూలోని ఫిజిక్స్ విభాగ సెమినార్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ రమేష్, సైన్స్ విభాగాల డీన్ పి.మల్లారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



విజయకేతనం చూపుతున్న విద్యార్థినులు



బ్యాగుతో ఇంటికి వెళ్తూ..



స్నేహితురాలికి వీడ్కోలు పలుకుతున్న విద్యార్థిని

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. దీంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థులు తమ స్నేహితులతో కలిసి కాసేపు సరదాగా గడిపారు. ఒకరినొకరు హత్తుకుని వీడ్కోలు పలికారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఐటీడీఏ పీఓ అంకిత్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థులు

- ఐటీడీఏ పీఓ అంకిత్

మహబూబాబాద్ రూరల్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ అంకిత్ అన్నారు. మానుకోట మండలంలోని రెడ్యాల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించి మిషన్ భగీరథ నీటిని వాడాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. భయపడకుండా, ప్రశాంతంగా ఆలోచించి పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ డీఈ రాంరెడ్డి, ఏఈ ప్రశాంత్, ఏటీడీఓలు సత్యవతి, భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి..

గూడూరు: విద్యార్థులు పట్టుదలతో చదవాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఎస్టీ బాలుర వసతి గృహం, మట్టెవాడలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ల్యాబ్, డార్మెటరీలు, కిచెన్, మరుగుదొడ్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, హెచ్ఎంలు పాల్గొన్నారు.



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

- కేయూలో ఉద్రిక్తత
- మహాధర్నా ర్యాలీ, పేపర్ లీకేజీపై ఆగ్రహం
- సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం
- పోలీసుల లాఠీచార్జ్, విద్యార్థి నాయకుడి తలకు గాయం
- విద్యార్థి జేఏసీ నాయకుల అరెస్ట్



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు



పోలీసులను అడ్డుకుంటున్న నిరసనకారులు



పూలకుండీ పగులగొడుతున్న విద్యార్థి

నేడు కేయూ బంద్‌కు పిలుపు

విద్యార్థి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ నేడు (గురువారం) కేయూ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థినాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ కేయూలో నిరసన తెలిపారు.

కేయూ క్యాంపస్: పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, వెంటనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నిర్వహించిన మహాధర్నా ఉద్రిక్తతకు చోటు చేసుకుంది. నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కేయూలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను నిర్వహిస్తామని కేయూ విద్యార్థి జేఏసీ అనుమతి కోరితే వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి పరిపాలనా భవనంవైపు రాగా పోలీసులు భారీ బందోబస్తుతో పరిపాలన భవనం రెండు గేట్లను మూసివేయడంతో రెండో గేటు వైపు ర్యాలీ నిర్వహించారు. రెండో గేటు కూడా మూసివేయడంతో వి ద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మళ్లీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వాలని, వెంటనే వీసీ బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సంఘర్షణ సభకు వీసీ రమేశ్ అనుమతి ఇస్తే మేము శాంతియుతంగా వెళ్లిపోతామని విద్యార్థి జేఏసీ నాయకులు పోలీసులను కోరారు. అయినా వీసీ రాకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. అప్పటికే ప్రధాన ద్వారం వద్ద మోహరించి ఉన్న పోలీసులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద పలు అద్దాలు పగిలిపోయాయి. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థినాయకులు కొన్ని పూలకుండీలను పగులగొట్టారు. మరోవైపు ఇద్దరు విద్యార్థి నాయకులు పరిపాలనా భవనం ఎక్కి తమ నిరసన తెలిపారు. అక్కడి నుంచి దూకుతారని భావించిన పోలీసులు వారిని కిందకు దించివేశారు. మరికొందరు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు లాక్కునే యత్నం చేయడంతో విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకుడు మేడ రంజిత్ తలకు గాయం అయింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ధ ర్మసాగర్ పీఎస్‌కు తరలించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కేయూ విద్యార్థి జేఏసీ

రాష్ట్రంలోని 35 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌ను అంగట్లో పెట్టారని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు మండిపడ్డారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి ప్రిపేర్ అయితే గ్రూప్ 1, తదితర పేపర్ల లీకేజీలతో వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఢిల్లీలో ఈడీ విచారణను ఎదుర్కొంటుంటే ప్రజలను, నిరుద్యోగులను గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీ లో తిష్ట వేశారని విమర్శించారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌ఖన్నా, కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎన్‌ఎస్‌యూఐ బాధ్యులు అలువాల కార్తీక్, రాకేష్, కృష్ణ, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, కల్లేపెల్లి ప్రశాంత్, కామగోని శ్రవణ్, వంశీకృష్ణ, నర్సింహారావు, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ నాయకులు రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

13మందిపై కేసు

వీసీ ఆచార్య రమేశ్ ఫిర్యాదు మేరకు 13 మంది విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ విద్యార్థి నాయకులను పరామర్శించారు.

ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వీసీ రమేశ్



సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకుండా వీసీ ఆచార్య రమేశ్ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా 30 లక్షల మంది నిరుద్యోగుల నియామకాలపై నమ్మకం కలగాలంటే టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, సభ్యులను బర్తరఫ్ చేయాలి. పేపర్ లీకేజీని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి.

-తిరుపతి యాదవ్, కేయూ విద్యార్థి జాక్ చైర్మన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం..



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది. పేపర్ లీకేజీపై టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి. సంఘర్షణ సభకు వీసీ అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

-రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వసంతోత్సవానికి వేళాయె

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో స్ప్రింగ్‌స్ప్రీ-23
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



కళాధ్వనిని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులచే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, సంస్కృతీ సంప్రదాయాలను పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ-23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. నిత్యం విద్యతో కుస్తీ పడుతూ ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్న నిట్ విద్యార్థులు తోటి విద్యార్థులతో పాటు దేశవ్యాప్త ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులతో ఆ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను, మన సంస్కృతీ సంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌గా ఏర్పాటు చేసుకునే మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20వేల మంది విద్యార్థులు ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ వేడుకల్లో పాల్గొననున్నారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చ రల్ ఫెస్ట్‌గా నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ నిలుస్తుంది.

ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో..

నిట్ వరంగల్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ వసంతోత్సవ వేడుకలకు ప్రత్యేక థీంను రూపొందిస్తారు. ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ-23కి కళాధ్వనిగా నామకరణం చేశారు. 2019లో కళాక్షేత్ర, 2020లో మితియాస్, 2022లో సృష్టి, 2023లో కళాధ్వనిగా నామకరణం చేశారు.

55కు పైగా ఈవెంట్స్..

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వనిలో 55కు పైగా ఈవెంట్స్‌తో అలరించనుంది. తొలిరోజు 7న టాలీవుడ్ నైట్ పేరిట టాలీవుడ్ సింగర్స్ నిట్ మైదానంలో అలరించనున్నారు. రెండో రోజు 8న డీజే నైట్, సన్‌బర్న్ పేరిట డీజేలు వివిధ రకాల పాటలతో అలరించనున్నారు, మూడో రోజు 9న బాలీవుడ్ నైట్ పేరిట బాలీవుడ్ సింగర్స్ ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు మూడురోజుల పాటు ప్రో షోలు, స్పాట్ లైట్స్, సాండ్ ఆర్ట్, సైలెంట్ డీజేస్, మాస్టర్ చెఫ్, జుంబాడ్యాన్స్, కొరియో నైట్, వార్ ఆఫ్ డీజేస్, ఐడల్, అల్యూర్‌లతో వసంతోత్సవం కలర్ ఫుల్‌గా సాగనుంది.

ప్రతిష్టాత్మకంగా స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వని

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వనిని ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో వేడుకలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. బుధవారం నిట్‌లోని సుభాష్‌చంద్రబోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, సంస్కృతీ సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు 200 మంది విద్యార్థులు నిట్‌లోని వివిధ క్లబ్స్‌తో మమేకమై కోర్‌టీంలుగా ఏర్పడి ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, కోర్ టీం వంశీకిషోర్, అజయ్‌కుమార్, పీయూష్‌కుమార్, సాయిగురునాథ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వనీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏప్రిల్ 6న ముఖ్యఅతిథిగా పాల్గొని స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకలను నిట్ మైదానంలో ప్రారంభించనున్నారు. పవన్ కల్యాణ్‌ను చూసేందుకు నిట్ వరంగల్ విద్యార్థులతో పాటు ఓరుగల్లు వాసులు ఎదురు చూస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎంట్రీ పాసుల కోసం ఇప్పటికే క్రేజ్ మొదలైంది. స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లను నిట్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగామ్‌లో క్యూఆర్‌కోడ్‌లతో అందజేస్తున్నారు.

'మా గౌరవానికి భంగం కలిగించారు'

కాశోజీ సెంటర్: వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డిలపై మహిళా కమిషన్‌లో బుధవారం గాదె సావిత్రిమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసింది. జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన తమ కుమారుడైన మహేందర్‌రెడ్డిని అన్యాయంగా నిరాధార ఆరోపణలతో ఉద్యోగ బాధ్యతలనుంచి తప్పించారని పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా నిరాధార కథనాలు ప్రచురించే విధంగా చేసి క్రిమినల్ కేసు పెట్టించి సమాజంలో తమకు ఉన్న గౌరవానికి భంగం కలిగించారని ఫిర్యాదులో తెలిపింది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని గాదె సావిత్రమ్మ కోరింది.

కలుషిత నీరు తాగి కూలీలకు అస్వస్థత

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో మిర్చి తోటలోకి కూలి పనులకు వెళ్లిన 25 మంది కూలీలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు గ్రామ సమీపంలోని మిర్చి తోటలో కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కూలీలు భోజనం చేసిన అనంతరం డ్రిప్ పైప్ నుంచి వచ్చే నీటిని తాగారు. అయితే డ్రిప్ పైపులు శుభ్రం చేసేందుకు రైతులు ఓ ద్రావణాన్ని వదిలారు. ఆ విషయం తెలియని కూలీలు నీరు తాగడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు ఆటో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించారు.



వాంతులు చేసుకుంటున్న కూలీలు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Ed SEATS AVAILABLE

B.Ed Seats Available 2022- 24 Batch, Rayalaseema University, Kurnool, Few Seats Only. Cell: 6303380836. [W-785506]

REAL ESTATE

PROPERTY FOR SALE

374 Sq.yds G+1 House SBH Colony Near Collector Office, NIT CLG, 2BHK Flats Near KUC Cross Road, Alankar Warangal. Cell: 7989106048. [W-785469]

PLOT FOR SALE

మామునూర్ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్ ఈస్ట్ కార్నర్ ప్లాటుకై, సంప్రదించవల్సిన సెల్ నెం: 9032111600, [W-785505]

GWMC-KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785504]

TO-LET

HNK, భీమారం పలివేల్పుల రోడ్ CRPF క్వార్టర్స్ దగ్గరలో దుర్గానగర్ రోడ్‌నెం-6 లోని 6 పేజ్‌ల G+2 గల బిల్డింగ్ కిరాయికి కలదు కాలేజ్, స్కూల్స్, హాస్టల్స్, బ్యాంక్స్, మిని ఫంక్షన్ హాల్స్‌కు గోడౌన్‌కు అనుకూలం. 7396539?4, 9618337228. [W-785460]

SERVICES

సిరి అసోసియేట్స్ హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785458]

WANTED

క్రిష్ణవేణి టె॥ కాలేజ్ (హన్మకొండ) కావలెను: వంటమాస్టర్(Male), మేల్ వార్డెన్స్, లేడీ వార్డెన్స్, జూ॥లెక్చరర్స్ - MATA, Phy, Chem, Bot, Zool, సీనియర్ లెక్చరర్స్ (Male), Computer Operator - Male, Cell: 9949610729. [WA-6932]

డ్రైవర్స్ కావలెను, టోయింగ్ ట్రక్‌కి బెంగుళూరులో పనిచేయుటకు మంచి జీతం+ రూం+ అలవెన్స్. సంప్ర॥ 9948434745, 9000687574. [WA-504]

ఇంటిలో ఉదయం, సాయంత్రం వంట చేయుటకు ఆడ వంట మనిషి వెంటనే కావలెను. సాలరీ: 4000-5000/- వివరాలకు సంప్ర॥ 9000286625. [W-785467]

MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంచైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్ : 70326 10569, 70931 25169. [NA-5468]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795262]

స్టార్ హోంకేర్ HYDలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి / వంట పనికి స్త్రీ/పు, లేడి టెలికాలర్స్ కావలెను. జీతం: 16,000/-, రూం + భోజనం ఫ్రీ. 78010 99881, 86398 28228 [V-775179]

ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325. [G-795265]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

హరేకృష్ణ హోంకేర్, నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం. జీతం:16k - 18k విజయవాడ.ఫోన్ : 9640528899, 9640648899 [H-793405]

LOANS

సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1190705]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.